అడవిని ఆక్రమిస్తే కఠిన చర్యలే

(మూడవ పేజీ తరువాయి)

ఆయన ఎక్స్ లో గురువారం పోస్ట్ చేశారు. అటవీభూముల ఆక్రమణ కేసులో ఏ1 గా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఉన్నారని,అక్రమణకు గురైన అటవీ భూములను వాటిని తిరిగి స్వాధీన చేసుకున్నామన్నారు.. అటవీ భూముల అన్యాక్రాంతంపై విచారణకు ప్రత్యేక కమిటీ వేశాం అని, ఎక్కడ భూములు ఆక్రమణకు గురైనా వెనక్కి తీసుకుంటాం అని అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మంగళంపేట అటవీ భూములలో ఆక్రమణలు చోటు చేసుకున్న మాట వాస్తవం..ఇందుకు సంబంధించి భారత న్యాయసంహితను అనుసరించి ఏపీ అటవీ చట్టంలోని 61 (2),20 (1)(డి)(2), 52(డి) ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ఏ1గా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఉన్నారు. ఏ2గా పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఏ3గా పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, ఏ4గా పెద్దిరెడ్డి ఇందిరమ్మ పేర్లు నమోదు చేశామన్నారు. అటవీ చట్టం ప్రకారం ప్రిలిమినరీ అఫెన్స్ రిపోర్ట్ (పీవోఆర్) ప్రకారం చార్జిషీటు దాఖలు చేశామని, ఆక్రమణకు గురైన 32.63 ఎకరాల భూమిని స్వాధీనం చేస్తుకున్నామన్నారు.కోర్టులో కేసుల వివరాలు దాఖలు చేశామన్నారు.1968 గెజిట్ ప్రకారం మంగళంపేట అటవీ ప్రాంతంలో 75.74 ఎకరాలకు పట్టాలు ఉన్నాయని,అయితే 32.63 ఎకరాల అటవీ భూమిని కూడా కలిపేసుకుని కంచె వేశారన్నారు. ఆ అటవీ భూముల్లో ఉద్యాన పంటలు వేసి సాగు చేసి, ఆదాయం పొందారని, చట్ట విరుద్ధంగా బోర్ వెల్ తవ్వారన్నారు.అటవీ వనరులు దుర్వినియోగం చేశారని,దాదాపు రూ.1.26 కోట్ల విలువైన అటవీ సంపదకు నష్టం వాటిల్లిందన్నారు. పి.ఓ.ఆర్.నెం.3/025 ప్రకారం వీరిపై ఏపీ ఫారెస్ట్ యాక్ట్ 1967, బి.ఎన్.ఎస్. సెక్షన్ల మేరకు కేసులు నమోదు చేసి నోటీసులు ఇవ్వడమైనదన్నారు. 32.63 ఎకరాలకు చట్టబద్ధమైన పత్రాలను కూడా వారు సమర్పించలేక పోయారని,అటవీ భూములు ఆక్రమించిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు.వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని, అటవీ భూముల అన్యాక్రాంతంపై విచారణకు రాష్ట్రస్థాయిలో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకొంటున్నామన్నారు. అటవీ భూముల వివరాలను వెబ్ సైట్లో పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సర్వే మొత్తం పూర్తి చేసి స్థలాల వివరాలను వెబ్‌సైట్లో పెడతామని అధికారులు తెలిపారు.

ఒంటరి ఏనుగు దాడి

- కుప్పం మండలంలో ఘటన
- రైతు మృతి, గ్రామంలో భయాందోళన

చిత్తూరు, ఆంధ్రప్రభ బ్యూరో: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం మరోసారి ఏనుగు దాడి కలకలం రేపింది. కుప్పం మండలం కూర్మాయిపల్లి సమీపంలోని మల్లకుంట వద్ద వేకువజామున జరిగిన ఘటనలో ఓ రైతు ప్రాణాలు కోల్పోయాడు. అడవి పందుల భయం కారణంగా పొలం వద్ద కాపలా కాసేక్రమంలో, గుడిసెలో నిద్రిస్తున్న వృద్ధ రైతు కిట్టప్ప (70)పై ఏనుగు దాడి చేసింది. ఏనుగు గర్జనలు విని సమీపంలోని గ్రామస్తులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే కిట్టప్ప మరణించి ఉన్నాడు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు, పోలీసు బృందం ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఏనుగు పాదముద్రల ఆధారంగా ట్రాకింగ్ ప్రారంభించారు. ఈ ఏనుగు నెల రోజులుగా కుప్పం సరిహద్దులోని తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా కాలి కోయిల్ ప్రాంతంలో సంచరిస్తూ భయపెడుతోందని, వృద్ధ మహిళపై దాడిచేసిందని, ఈ ఘటనలో ఆమె చేయి రెండు ముక్కలైందని స్థానికులు చెప్పారు. ఇటీవల ఏనుగుల సంచారం పెరిగిపోయిందని, రాత్రివేళ రోడ్లపై తిరగడానికి భయపడుతున్నామని వాపోతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగుల కదలికలపై వెంటనే సమాచారం ఇవ్వాలని అటవీ శాఖ అధికారులు గ్రామస్తులకు సూచించారు.

ఏనుగుల సంచారంపై ముందస్తు హెచ్చరికలు పెంచాలి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అమరావతి, ఆంధ్రప్రభ: అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాలలోకి ఏనుగులు ప్రవేశించే పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికలు చేసే ప్రక్రియను మరింత పెంచాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. కుప్పం మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో కిట్టయ్య అనే వ్యక్తి ఏనుగు దాడిలో మరణించిన ఘటన ఉప ముఖ్యమంత్రి దృష్టికి వచ్చింది. పి.సి.సి.ఎఫ్., సంబంధిత అధికారులతో గురువారం ఉదయం ఈ ఘటనపై చర్చించారు. కిట్టయ్యకుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఆ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని సత్వరమే అందించాలని స్పష్టం చేశారు. తమిళనాడు అటవీ ప్రాంతం వైపు నుంచి వచ్చిన ఏనుగు మూలంగా ఈ ఘటన చోటు చేసుకొందని, అక్కడ కూడా సదరు ఏనుగు మూలంగా మరణాలు సంభవించాయని అటవీ శాఖ అధికారులు వివరించారు. మన రాష్ట్ర అటవీ ప్రాంతంలోకి వస్తోందని ట్రాక్ చేసిన వెంటనే సమీప గ్రామాల వారికి ముందుగానే తెలియచేశామన్నారు. ముందస్తు హెచ్చరికలను మరింత విస్తృతం చేయండి. గ్రామాలవారీగానూ, రైతులతోనూ సోషల్ మీడియా గ్రూప్స్ ఏర్పాటు చేసి వాటికి టెక్స్ట్ మెసేజిలతోపాటు, వాయిస్ మెసేజిలు కూడా పంపిస్తే సమాచారం తొందరగా చేరుతుందని అన్నారు.

'ది వైల్డ్ ఈస్ట్' పుస్తకం అద్భుతం

- ఎక్స్ లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అమరావతి, ఆంధ్రప్రభ: కొంతకాలం క్రితం ''ది వైల్డ్ ఈస్ట్'' అనే పుస్తకాన్ని చదవడం ప్రారంభించాను.. అందులో ఉన్న వివరాలు ఆశ్చర్యపరిచేంత నిజాయితీగా, స్పష్టంగా ఉన్నాయి.. ఈ పుస్తకం శేషాచలం ప్రాంతం, తూర్పు కనుమల్లోని ఎర్రచందనం వంటి విలువైన సహజ వనరులు ఎలా ప్రభుత్వ యంత్రాంగం కళ్లముందే దోపిడీకి గురయ్యాయో బహిర్గతం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు అయన గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. వెనుక దాక్కున్న కొందరు ''నాయకులు'' అసలు మాఫియా గ్యాంగ్‌లా ఎలా వ్యవహరించారో ఈ రచన చూపిస్తుందన్నారు.

వారిలో ఒక పాత్రనా దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షించిందని, రచయిత సినిమా సన్నివేశంలా చూపించినట్టు, ఒక చిన్న కాంట్రాక్టర్ ఎలా ఎర్రచందనం స్మగ్లింగ్ సామ్రాజ్యానికి రాజుగా మారాడో, లాభం, అధికారం కోసం ఎలా నేర సామ్రాజ్యాన్ని నిర్మించాడో అద్భుతంగా వివరించారని అన్నారు.ఆ పుస్తకం చదువుతుంటే నేరం గురించి మాత్రమే కాదు ??? మన భూమి, అరణ్యాలు, ప్రకృతి, ప్రజలు ఎలా ద్రోహానికి గురయ్యారో కూడా మనసుకు ముద్రపడేలా అనిపిస్తుందని పవన్ కళ్యాణ్ చెప్పారు.

ఘనంగా సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ కుమార్తె వివాహం

అమరావతి, ఆంధ్రప్రభ : సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ కుమార్తె సాయిలీల వివాహం సాయికృష్ణతో కేరళ రాష్ట్రం, త్రివేంద్రం సమీపంలోని కోవలం బీచ్ లో గురువారం ఘనంగా జరిగింది.ఈ వివాహ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి కె.ప్రేకాష్ బాబు, సిపిఐ పార్ల మెంట్ నాయకులు పి.సంతోష్ కుమార్, రాష్ట్ర సిపిఐ ప్రధాన కార్యదర్శి బినోయ్ విశ్వం,కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి సాథి సుందరష్ ,వ్యవసాయశాఖ మంత్రి వర్యులు పి.ప్రసాద్, రెవె న్యూశాఖ మంత్రి కె.రాజన్ ,ఆహార సరఫరా శాఖ మంత్రి అనిల్ కుమార్,శాసన సభ్యురాలు లతాదేవి,ఫిలిం డైరెక్టర్ చంద్ర సిద్ధార్థ్ తదితరులు ప్రముఖులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు విజయవాడలోని బందర్ రోడ్ లో గల ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ లో వెడ్డింగ్ రిసెప్షన్ ఉంటుందని కె. రామకృష్ణ తెలియజేశారు.

విశాఖ.. హై సెక్యూరిటీ జోన్

- పెట్టుబడుల సదస్సుకు కట్టుదిట్టమైన భద్రత
- దాదాపు 3500 మంది పోలీసులతో రక్షణ చర్యలు
- ఏర్పాట్లు పరిశీలించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

అమరావతి, ఆంధ్రప్రభ: విశాఖపట్నం నగరం ప్రస్తుతం హై సెక్యూరిటీ జోన్‌గా మారింది. సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టారు. దేశ, విదేశాల నుండి పరిశ్రమలు, ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొననున్న ఈ సదస్సు సజావుగా సాగేందుకు పోలీస్‌శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి అదనపు పోలీసు బలగాలను తరలించి దాదాపు 3,500 మంది అధికారులు, సిబ్బందితో రక్షణ చర్యలు చేపట్టారు. విశాఖ నగర పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చీ, విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి సారథ్యంలో అదనపు పోలీసు ఉన్నతాధికారులను ప్రత్యేకంగా నియమించారు.

మరోవైపు ఇంటిలిజెన్స్ ప్రత్యేక విభాగాలు అప్రమత్త చర్యలు చేపట్టారు. పైగా ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటనను పురస్కరించుకుని రాష్ట్రంలో రెండోరోజు కూడా ఎన్ఐఏ తనిఖీలు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు జరిగే విశాఖ పెట్టుబడుల సదస్సుకు మరింత కట్టుదిట్టమైన భద్రత చర్యలు కొనసాగుతున్నాయి. తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. విశాఖ నగరాన్ని పోలీసు శాఖ తమ చేతుల్లోకి తీసుకుని సామాన్య ప్రజానీకానికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా భద్రత ఏర్పాట్లు నిర్వహిస్తోంది. సదస్సు సందర్భంగా నగర భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం మొత్తం 2,200 మంది పోలీసు సిబ్బందిని కేటాయించారు. వీరిలో సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఉన్నారు. సదస్సు ప్రధాన వేదికలైన ఆంధ్రా యూనివర్సిటీ పరిసర ప్రాంతాలు పూర్తిగా ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. నిఘా కోసం 50 డ్రోన్లు, 155 సీసీ కెమెరాలు నగరంలోని కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇవి 24 గంటలూ నిరంతరంగా పని చేసేలా పర్యవేక్షణ కొనసాగుతోంది.

సదస్సు సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నారు. వాహనాల కదలికలను అప్రం యాప్ ద్వారా రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తున్నారు. రూట్ మ్యాప్‌లు, డైవర్షన్‌లు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల ఘటన నేపథ్యంలో విశాఖలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. సీఐఐ సదస్సు కారణం గా ప్రత్యేక నిఘా బృందాలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు మోహరించాయి. ప్రతి వేదిక, హోటల్, వీఐపీ మార్గాల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు జరుగుతున్నాయి.

నిరంతర అప్రమత్తం: డీజీపీ

విశాఖపట్నం సిటీలో జరుగుతున్న భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం విశాఖపట్నం చేరుకున్నారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆయనకు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. సదస్సు నిర్వహణలో తీసుకోవలసిన భద్రతా ఏర్పాట్లు, సమన్వయ చర్యలపై చర్చించారు. భద్రతా ఏర్పాట్లను డీజీపీ స్వయంగా సీనియర్ అధికారులతో సమీక్షించారు. ఏవిధమైన అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెట్టుబడుల సదస్సు సందర్భంగా భ ద్రతా ఏర్పాట్లు, రక్షణ చర్యలపై నిరంతర పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయండి

- పరకామణి కేసులో

హైకోర్టు ముందుకు రవికుమార్ అప్పీల్

అమరావతి, ఆంధ్రప్రభ: టీటీడీ పరకామణి కేసులో నిందితుడు హైకోర్టు ధర్మాసనం ఎదుట అప్పీల్ దాఖలు చేశారు. పెద్ద జియ్యంగార్ మఠంలో క్లర్క్ పనిచేస్తున్న తాను టీటీడీ ఉద్యోగిని కాదని ఈ మఠం ప్రైవేటు మఠమైనందున తాను పబ్లిక్ సర్వెంట్ పరిధిలోకి రానని అప్పీల్లో పేర్కొన్నారు. తన ఆస్తులపై దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సరికాదని, అలా దర్యాప్తు చేసే అధికారం ఏసీబీకి లేనందువల్ల ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఈమేరకు తిరుమల శ్రీవారి పరకామణిలో రూ.72వేల విలువ చేసే 900 డాలర్ల చోరీ కేసులో సీఐడీ దర్యాప్తునకు ఆదేశించడంతో పాటు తన ఆస్తులపై ఏసీబీ దర్యాప్తునకు ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేశారు. దీనిపై గురువారం విచారణ సందర్భంగా రవికుమార్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తరవు నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ ప్రైవేటు మఠంలో పనిచేసే ఉద్యోగిని పబ్లిక్ సర్వెంట్‌గా పేర్కొంటూ సింగిల్ జడ్జి ఏసీబీ దర్యాప్తునకు ఆదేశించడంపైనే తమ అభ్యంతరమని తెలిపారు. పరకామణిలో దొంగతనం కేసు చట్ట ప్రకారం రాజీ చేసుకోదగ్గ కేసు కనుకే చట్టానికి అనుగుణంగానే లోక్ అదాలత్ సైతం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ ఇదే వ్యవహారంలో లోక్ అదాలత్ ఉత్తర్వులపై ఇదే హైకోర్టులోని మరో ధర్మాసనం విచారణ జరుపుతోందని, ఒకే అంశంపై రెండు వేర్వేరు ధర్మాసనాలు విచారణ జరపాల్సిన అవసరం లేదని గుర్తు చేసింది. అందువల్ల లోక్ అదాలత్ ఉత్తర్వులకు సంబంధించిన సుమోటో వ్యాజ్యాన్ని కూడా ఈ అప్పీల్‌తో కలిపి తామే విచారిస్తామంది. ఈ అప్పీల్‌ను ఆ సుమోటో వ్యాజ్యానికి జత చేయాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

సీఐఐ సదస్సుకు భారీ పోలీసు భద్రత

- 3,500మంది సిబ్బందితో పటిష్ట నిఘా
- సదస్సుపై సోషల్ మీడియాలో దుష్ప్రచారాన్ని ఉపేక్షించం
- వైసీపీ విష ప్రచారాన్ని సహించం : హోంమంత్రి అనిత

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), ఆంధ్రప్రభ : విశాఖలో ఈనెల 14,15వ తేదీలలో ఎంతో ప్రతిష్టత్మకంగా జరగనున్న భాగస్వామ్య సదస్సుకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సుమారు 3,500 మంది పోలీసులతో పటిష్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. భద్రత విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడబోదని తేల్చి చెప్పారు. సదస్సుకు హాజరయ్యే ప్రతి వీఐపి విమానాశ్ర యంలో అడుగుపెట్టినప్పటి నుంచి తిరిగి వారి గమ్యస్థానాలకు చేరేంత వరకు పూర్తిస్థాయి రక్షణ కల్పించే బాధ్యతను పోలీసు శాఖ తీసుకుందని తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి అప్రమత్తత ప్రకటించామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తీవ్రవాదంతో పాటు రాజకీయ ఉగ్రవాదం పైనా తమ ప్రభుత్వం సీరియస్గా ఉందని మంత్రి అనిత వ్యాఖ్యానించారు. విశాఖ సదస్సుపై జగన్ బ్యాచ్ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని ఉపేక్షించేది లేదని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే ఇలాంటి చర్యలను కఠినంగా అణచివేస్తామన్నారు. గతంలో వలసలకు కేంద్రంగా ఉన్న ఉత్తరాంధ్ర, ఇప్పుడు పెట్టుబడులతో వలస వచ్చేవారికి గమ్యస్థానంగా మారుతోందని మంత్రి అనిత హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన కంపెనీలు ఇప్పుడు తిరిగి వస్తున్నాయంటే దానికి బ్రాండ్ సీబీఎన్, మంత్రి నారా లోకేశ్ కృషి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పట్టుదలే కారణమని ఆమె కొనియాడారు. వారి సమష్టి కృషితోనే రాష్ట్రానికి మళ్లీ మంచిరోజులు వచ్చాయని తెలిపారు.

నేషనల్ పార్క్ ఎన్‌కౌంటర్ మృతదేహాల గుర్తింపు

- ఆరుగురు మావోయిస్టులపై రూ. 27 లక్షల రివార్డు
- బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ వెల్లడి

చర్ల, ఆంధ్రప్రభ : చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మృతదేహాలను గుర్తించినట్లు బీజాపూర్ జిల్లా ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ తెలిపారు. గత మంగళవారం బీజాపూర్ జిల్లా నేషనల్ పార్కు అటవీ ప్రాంతంలో బస్తర్ డివిజన్‌కు చెందిన 50 నుండి 60 మంది మావోయిస్టులు ఉన్నారనే నిఘా వర్గాలు అందించిన ఫోటో రైట్ అప్ సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీ దంతెవాడ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఇరు వర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు, వారిని గురువారం గుర్తించినట్లు తెలిపారు. మృతి చెందిన మావోయిస్టులలో డీవీసీఎం కన్నా అలియాస్ బుచ్చన్న, ఇతనిపై ఎనిమిది లక్షల రూపాయల రివార్డు ఉందని, డీవీసీఎం ఊర్మిళ, ఈమె అగ్ర నాయకత్వంలో భాగమైన మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు క్యాడర్ పాపారావు భార్య అని, ఈమెపై 8 లక్షల రూపాయల రివార్డు ఉందని, అలాగే ఏసీఎం జగత్ అలియాస్ మోటు ఇతనిపై ఐదు లక్షల రూపాయల రివార్డు, అదేవిధంగా పీఎం దేవే ఇతనిపై 2 లక్షల రూపాయల రివార్డు ఉందన్నారు. అలాగే పీఎం భగత్ ఇతనిపై రెండు లక్షల రూపాయల రివార్డు ఉందని, పీఎం మంగళి ఇతనిపై 2 లక్షల రూపాయల రివార్డు ఉందని వెల్లడించారు. బస్తర్ రేంజ్ ఐజీ పీ సుందర్ రాజ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కమలోశన్ కశ్యప్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్, ఎస్టీఎఫ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, సీఆర్పీఎఫ్ ఓప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పాల్గొన్నారు.

బెజవాడలో దారుణం

భార్యను నడిరోడ్డుపై పొడిచి చంపిన భర్త

విజయవాడ, ఆంధ్రప్రభ: విజయ వాడ నగరంలో ఓ పాశవిక ఘటన చోటుచేసుకుంది. దంపతుల మధ్య వివాదం దారుణమైన హత్యకు దారితీసింది. నూజి వీడు కు చెందిన మట్ట కొయ్య సరస్వతి (30) అవనిగడ్డ కు చెందిన దీపాల విజయ్ 2022లో ప్రేమవివాహం చేసు కుని జీవనం సాగిస్తున్నారు.గత కొంతకాలంగా వారిద్దరి మధ్య మనస్పర్థల రావడంతో విడి విడిగా జీవిస్తున్నారు. విజయ్ విజయవాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్‌లో పనిచేస్తూ విజయ వాడలోనే నివాసం ఉంటుండగా, మృ తురాలు విజయవాడ లోని విన్స్ హాస్పిటల్ లో పనిచేస్తూ ప్రతిరోజూ నూజివీడు నుంచి విజయవాడకు ప్రయా ణం చేస్తుంది. గురు వారం సాయంత్రం ఆమె డ్యూటీ ముగిం చుకుని ఇంటికి వెళుతున్న తరుణంలో తన భర్త విజయ్ పథకం ప్రకా రం కాపుగాచి ముందుగా సిద్ధం చేసి తెచ్చు కున్న కత్తితో పీక కోసి పాశవికంగా హత్య చేశాడు. ఘటన స్థలంలో రక్తసిక్తమై పడిపోయిన మహిళను కాపాడడానికి వచ్చిన చుట్టుపక్కల వారని కూడా దగ్గరకు వస్తే చంపేస్తా అంటూ బెదిరించి పరారయ్యాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి నిందితుని కోసం గాలిస్తున్నారు.

లిక్కర్ స్కాం కేసులో సజ్జల శ్రీధర్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ 17కి వాయిదా

అమరావతి, ఆంధ్రప్రభ: లిక్కర్ స్కాం కేసులో తన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపేలా విజయవాడ ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరుతూ నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను ఈనెల 17వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. ఈ వ్యాజ్యంలో లేవనెత్తిన అన్నీ అంశాలను ఆరోజు పరిశీలన చేస్తామని స్పష్టం చేసింది. లిక్కర్ స్కాం కేసులో శ్రీధర్‌రెడ్డి అరెస్టయి ప్రస్తుతం విజయవాడ జిల్లాజైలులో రిమాండ్‌లో ఉన్నారు. తన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను రిటర్న్ చేస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు గత నెల 29న జారీ చేసిన డాకెట్ ఆర్డర్‌ను కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌కు నెంబర్ కేటాయించి, దానిపై విచారణ జరిపేలా ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరుతూ ఆయన పిటిషన్‌లో కోరారు. దీనిపై గురువారం విచారణ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి తరపు న్యాయవాది అభయ్ సిద్దాంత్ వాదనలు వినిపిస్తూ తమ పిటిషన్‌ను విచారణర్హత లేదని పక్కన పెట్టడంతో సుప్రీంకోర్టు ప్రతీ బెయిల్ పిటిషన్‌ను కూడా ఆ కేసు పూర్వాపరాల ఆధారంగా విచారించాలని స్పష్టంగా చెప్పిన విషయాన్ని ఏసీబీ కోర్టు దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. అయినాకూడా ఏసీబీ కోర్టు నా డీఫాల్ట్ పిటిషన్‌ను రిటన్ చేసిందన్నారు. తమ పిటిషన్‌కు నెంబర్ కేటాయించి విచారణ జరిపేలా ఆదేశాలు ఇవ్వాలని, ఆ పిటిషన్‌ను కొట్టేసినా తమకు అభ్యంతరం లేదన్నారు. వాదనల అనంతరం ఈ వ్యవహారంలో సోమవారం అన్నీ అంశాలను పరిశీలిస్తామన్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంజేపీలో పదోన్నతుల సందడి

- 11 మంది జూనియర్ ప్రిన్సిపాళ్లకు పదోన్నతులు
- సీనియర్ ప్రిన్సిపాళ్లగా నియామకం

అమరావతి, ఆంధ్రప్రభ: ఎంజేపీ గురుకులాల్లో పదోన్నతుల సందడి నెలకొంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత చొరవతో పదోన్నతులకు లైన్ క్లియర్ అయింది. దీంతో 11 మంది జూనియర్ ప్రిన్సిపాళ్లకు సీనియర్ ప్రిన్సిపాళ్లగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంజేపీ గురుకుల పాఠశాలల్లో పదోన్నతుల కోసం జూనియర్ ప్రిన్సిపాళ్లు కొన్నేళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పదోన్నతులపై వారి ఆశలు చిగురించాయి. ఇదే విషయమై మంత్రి సవిత దృష్టికి ఎంజేపీ గురుకులాల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తీసుకొచ్చారు. ఇన్చార్జిలతో గురుకులాల నిర్వహణ వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రికి వివరించారు. మంత్రి సవిత వెంటనే స్పందించి, గురుకుల పాఠశాలల్లో పదోన్నతుల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలు నేపథ్యంలో 11 మంది జూనియర్ ప్రిన్సిపాళ్లకు సీనియర్ ప్రిన్సిపాళ్లగా పదోన్నతులు కల్పిస్తూ ఎంజేపీ గురుకులాల కార్యదర్శి మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న పదోన్నతులు రావడంతో జూనియర్ ప్రిన్సిపాళ్లు, ఎంజేపీ గురుకులాల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు.

ఎంజేపీ విద్యార్థులకు నీట్, ఐఐటీ శిక్షణ

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

అమరావతి, ఆంధ్రప్రభ: ఎంజేపీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఫస్ట్ ఇంటర్ నుంచి నీట్, ఐఐటీలో శిక్షణ ఇవ్వ నున్నారు. బాలురు, బాలికలకు వేర్వేరు గా శిక్షణ అందజేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె వివరాలను వెల్లడించారు.